


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

**127**

**(19` ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రపంచంలో** మానవజాతి ఎంతవరకూ వుందో అంతవరకూ దాంపత్యాల విలాసం దాగి దోబూచులాడుతూనే వుంటుంది. సామాన్యంగా ఈ జంటలు కలవవు. ఒకటి బండతీగ అయితే, ఒకటి సన్నతీగ, ఒకటి ఇనప చక్రమైతే ఒకటి కొయ్య చక్రం. ఒకటి మూగరాగమైతే ఒకటి శంఖారావం. ఇలా వుంటూ వుంటాయి.

మా చిన్న తనంలో బందరులో బెండకాయలు కానీ, కానీ కట్టల క్రింద కట్టి అమ్మేవారు. అందులో సర్వసామాన్యంగా ఒకటి ముదురు కాయ వుండి తీరేది. లేదా దాని స్థానంలో ఒక పుచ్చుకాయ వుండేది. ఎప్పుడోగానీ, రెండు నవనవలాడే మంచి కాయలుండేవి కావు. ఆ బెండకాయల కట్టలల్లేనే భగవంతుడు ఇద్దరిద్దర్ని కట్టకట్టి ఈ విశాల ప్రపంచంలో విసిరివేస్తూ వుంటాడల్లే వుంది -

"నే చెప్పేదాకా కట్ట వూడదీయటానికి వీల్లేదు జాగ్రత్త" అని హెచ్చరిస్తూ.

పెళ్ళిళ్ళలో నూతన దంపతుల్ని అనేకమంది దీవిస్తారు. ఆశీస్సుల వర్షం కురిపిస్తారు. ఎన్నో మంత్రాలు చదివి దాంపత్య జీవనం అద్భుతంగా వుండాలని ఉవ్విళ్ళూరుతారు. కొన్ని కొన్ని సందర్భాలలో పెళ్ళి మేళాలు అటువెళ్ళడం ఆలస్యంగా వీరి మేళాలు ప్రారంభమవుతూ వుంటాయి.

ఈ రోజుల్లో లెక్క చూస్తే, "ఎందుకు చేసుకున్నారా మహానుభావ" అని మోకాళ్ళమీద కూర్చుని, మిడిగ్రుడ్లు వేసుకుని మింటి వంక చూసే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది.

భార్య అనుకూలవతి కాకపోతే భర్త బ్రతుకు పంచ బంగళా. భర్త భార్యాద్వేషి, సంసార ద్వేషి అయితే భార్య పని నిత్య ప్రవాసం. అసందర్భ సహవాసం. ఎడతెగని ఆయాసం అయిపోతుంది.

అందుకనే ఇప్పటి భార్యా ద్వేషుల సంఖ్య పెరగబట్టే చాలామంది స్త్రీలు ఎటుపోయి ఎటు వచ్చినా స్వతంత్రులుగా జీవించడానికి అనుకూలమైన పరిస్థితులు అన్వేషించడం జరుగుతోంది.

కొందరు అనుకూల దాంపత్యాలనుభవించేవారు కూడా ఈ కాలంలో ఆర్థిక పరిస్థితులు సరిగా లేవని తెలిసి, కన్నీళ్ళు చన్నీళ్ళుగా ఉభయులూ సంపాదించడం అవసరమనే భావంతో, ప్రొద్దున్న పది అయ్యేటప్పటికి చెరో ప్రక్కకు పరిగెత్తడం జరుగుతోంది. ఇది ఇప్పుడు వచ్చిన మార్పు అనుకోండి.

పూర్వకాలంలో భార్యలు చేయవలసిన పనులు భర్తకు సపర్యచెయ్యడం, పిల్లల్ని పోషించి బుద్ధులు నేర్పడం, అతిధిలభ్యాగతి సేవలు చేయడం వగైరాలు. వీటిని ఎంత బాగా నిర్వహిస్తే అంత గొప్పగా భావించేవారు. `మహా ఇల్లాలు` - `పరమ సాధ్వి" అనేవారు. ఆ జంటను "పుణ్యదంపతులు" అని వేనోళ్ళ పొగిడేవారు.

అంటే స్త్రీలు కేవలం భర్తల పాప పుణ్యాలు, ప్రతిష్ఠా, అప్రతిష్ఠలూ, సుఖదుఃఖాలు పంచుకునే ప్రాణులుగా మాత్రంగానే వుండేవారు. ఇప్పుడు కొంచెం మార్పు వచ్చింది. మగువలు కూడా స్వతంత్ర జీవనం కోరుతున్నారుగానీ భర్తకు నీడగా అడుగుల్లో అడుగులు వేసే గుడ్డి జీవిగా వుండటానికి ఇష్టపడటంలేదు.

వెనుకటికి ఒకావిడ తన పతిభక్తిని గురించి చెపుతూ, ''నేనెప్పుడూ ఆయన్ని అనుసరిస్తూనే వుంటాను. అడుగుల్లో అడుగులు వేసి నడుస్తాను గానీ వేరే అడుగు వెయ్యడం నాకు తెలియనే తెలియదు'' అన్నదట.

అది విన్న ఆవిడ ''అడుగుల్లో అడుగులు వెయ్యడం వరకూ బాగానే వుంది. కానీ మడమలు మాత్రం తొక్కడానికి ప్రయత్నించకు. పురుషుడు ముందుకు పడగలడు'' అని సలహా చెప్పిందిట.

ఆధునిక నాగరికతలో ప్రముఖులైన పురుషుల భార్యలకు ఒక విధమైన ప్రత్యేకత ఏర్పడింది. పదవులలో వున్న భార్యలు పదిమందిలోకి రావడానికెలాంటి అభ్యంతరం వుండదు. భర్తలు ఎక్కడికి వెళ్ళినా వారిని వదిలి పెట్టడానికి వీలుండదు. పర్యటనలు కలిసి సాగించవలసిందే వేదికలిద్దరూ అలంకరించవలసిందే సన్మానాలు, వీడ్కోలులు కలిసి అందుకోవలసిందే

మనవాళ్ళు ఏవైనా వ్రతాలు, క్రతువులు వగైరాలు చేయవలసి వచ్చినప్పుడు అర్ధాంగి ప్రక్కన ఉండాల్సిందేనంటారు. ఈ ధర్మం ఈ రోజుల్లో పదవులలో వున్నవారికి బాగ అన్వయిస్తోంది. భార్య ప్రక్కనలేందే వారికసలు తోచదు. ఇంచుమించుగా కర్తవ్య మూఢులైపోతారు. భర్త ఏ సభకైనా ప్రారంభోత్సవం చేస్తే భార్య బహుమతులు పంచిపెట్టాలి.

చాలావరకు ఈ రోజుల్లో మగవాళ్ళద్వారా బహుమతులందుకోవడం అనే ఆచారంపోయింది. శ్రీమతుల చేతులతో స్వీకరిస్తే తప్ప చిత్రాలు పల్లవించడం లేదు. గుర్రపు పందాలలో మొదలుకుని, కుస్తీ పందాల వరకూ బహుమతులివ్వడానికి ఒక లలనామణి అవసరమవుతోంది. అలా జరగకపోతే ఆ పండుగ నిండుగా వుండటంలేదు.

కొన్ని కొన్ని సందర్భాలలో భార్యాభర్తలు ఒక క్యాంపులో దిగగానే ఎవరి కార్యక్రమాలలో వారు నిమగ్నులైపోతారు. ఆయనకు నాలుగు ప్రోగ్రాములుంటే ఆవిడగారికి ఆరు ప్రోగ్రాములుంటాయి. ఈయనకొకచోట డిన్నరుంటే, ఆవిడగారికి ఇంకో చోట. ఇలా తిరిగి తిరిగి ఏ అర్ధరాత్రికో బసకు చేరడం. ఇద్దరూ తమకు వేసిన పూలదండలు లెక్కవేసుకోవడం జరుగుతూ వుంటుంది.

భర్తను గౌరవించడంకంటే, భార్యను గౌరవించడంలో కానుకలు సమర్పించడంలోనే ఎక్కువ మేలు వుంది. అవసరమైనప్పుడు అమ్మగారు అయ్యగారితో శిపార్సు చేస్తారు. అనే ఆశాభావం ప్రజల్లో, సంస్థల్లో ముఖ్యంగా క్రింది ఉద్యోగుల్లో ఎక్కువగా ప్రాకులాడుతూ వుంటుంది. భర్తలు ఈ విషయంలో చిన్నబుచ్చుకోరు. తమ అర్ధాంగులకు అంతటి స్థానం లభించిందని చిరునవ్వులు గుమ్మరించుకుంటారు.

వెనుకటికి ఇంగ్లాండులో ఒక మంత్రిగారుండేవారుట. ఆయన అర్ధాంగికి దాసుడట. ఇంచుమించుగా మంత్రిత్వమంతా ఆవిడే నడిపేదిట. ఆయన భర్త అవును కాదని తిప్పటానికీ, చెయ్యి సంతకాలు చెయ్యడానికి మాత్రమే ఉపయోగించేదట.

ఎవరైనా ఆయనగారి వద్దకు పనిమీద వెళ్ళి సలాం కొట్టి నిలబడగానే ఎక్కడనుంచి రావడం? అనేవాడుట. వాళ్ళు ''క్రాస్ వద్దనుంచి''( అంటే వేంటనే ఆ పని చేసే వాడుట క్షణం ఆగడానికి కూడా వీలు లేదు. ఆవిడగారు తన వద్దకు వచ్చి మంచి చేసుకున్న వాళ్ళను భర్త దగ్గరకు పంపుతూ ఆయన 'ఎక్కడ నుంచి రావడం అంటాడు. మీరు వెంటనే క్రాస్ దగ్గర నుంచి' అని చెప్పమనేదిట. అది ఆ దంపతులు పెట్టుకున్న సాంకేతికం.

ఈ విధంగా వెళ్ళని వాళ్ళు ''ఎక్కడ నుంచి?'' అని అడగ్గానే ''మా యింటిదగ్గర నుంచే'' అంటే, మంత్రి పుంగవులు వాళ్ళ కాగితం మీద క్రాస్ మార్కులుపెట్టి, క్యాంపు క్లర్కు దగ్గిరికి వెళ్ళమనేవాడట. ఆ క్లర్కు వాళ్ళను క్రాస్ మార్కులోగల అంతరార్థం బోధించి పంపేవాడట.

ఇలా భర్తలు ప్రజల్ని పరిపాలిస్తుంటే భార్యలు వారిని పరిపాలించడమనే అద్భుత గాధలు కొన్ని వుంటాయి దాంపత్యాలలో. వీరిని అర్ధాంగులనాలో, అధికారాంగులనాలో తెలియదు.

దంపతులలో ఎవరో ఒకరు రెండవ వారికి లోబడితే అట్టే తగులుండవు. భార్యకు భర్తలోబడితే అక్కడ సొగసులు రాజ్యం చేస్తాయి. సంస్కారాలు పూజ్యమవుతాయి.

Post your comments